క్లుప్తంగా

నిశ్చల భక్తితో ఆరాధిస్తే శివానుగ్రహం



అగస్త్యరాజును సత్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: నిశ్చల భక్తితో శివుడిని ఆరాధిస్తే భక్తులకు శివానుగ్రహం లభిస్తుందని జ్యోతిష, వాస్తుసిద్ధాంతి అగస్త్యరాజు శివ అన్నారు. ఆదివారం నగరంలోని లాయర్‌పేట రమణ మహర్షి ప్రశాంతి కేంద్రంలో సాయంత్రం 'ఈశ్వర తత్వం' అనే అంశంపై ఆయన ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. మానవ జన్మ సార్థకతకు అనుసరించాల్సిన ఆధ్యాత్మిక మార్గాలు, మోక్ష సాధనలో ఈశ్వర ఆరాధన ప్రాముఖ్యత, నిశ్చల భక్తితో ఆరాధిస్తే భక్తవత్సలుడైన శివుడు తన భక్తులను ఏ విధంగా అనుగ్రహిస్తాడు.. శుభకరుడైన శంకరుడు లోకాలను ఉపద్రవాల నుంచి ఎలా రక్షించాడనే ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకుంది. భక్తసులభుడై భక్తులకు మోక్షమిచ్చి, తనలో ఎలా లయం చేసుకొన్నాడు ఇత్యాది అంశాలపై ఉదాహరణల సహితంగా భక్తులకు శివ చక్కగా వివరించారు. అనంతరం రమణ మహర్షి ప్రశాంతి కేంద్రం కమిటి సభ్యులు అగస్త్యరాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 1న ఆకాశవాణిలో ముక్తావళి ప్రసంగం

ఒంగోలు మెట్రో: ఆకాశవాణి మార్కాపురం కేంద్రం ద్వారా మార్చి 1వ తేదీ శనివారం ఉదయం 6:30 గంటలకు సూక్తి ముక్తావళి కార్యక్రమంలో తన ప్రసంగం ప్రసారం అవుతుందని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు తెలిపారు.

చెంచయ్య, కోటయ్య సేవలు మరువలేనివి



చెంచయ్య, కోటయ్యలకు నివాళులర్పిస్తున్న నాయకులు

సంతనూతలపాడు: మాజీ శాసనసభ్యుడు తవనం చెంచయ్య, సీపీఎం జిల్లా నాయకుడు పమిడి కోటయ్యల వర్ధంతుల సందర్భంగా ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో చెంచయ్య, కోటయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజలకు వారు చేసిన సేవలు మరువలేనివి అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు, జిల్లా కమిటీ సభ్యులు బంకా సుబ్బారావు, మండల కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి, మండల నాయకులు నెరుసుల వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్, దాసరి చినబాబు, ఎస్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణలో నూతన ఆవిష్కరణలు కీలకం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్య అతిథులు

ఒంగోలు టౌన్: సుఖ వ్యాధులు, హెచ్‌ఐవీ తదితర దీర్ఘకాలిక వ్యాధులపై వైద్యులు అవగాహన పెంపొందించుకోవాలని ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్ చెప్పారు. ఆదివారం ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలలో చర్మవ్యాధుల విభాగానికి సంబంధించి జోనల్ వర్క్ షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన హెచ్‌ఐవీ, సుఖ వ్యాధులు నూతన ఆవిష్కరణలు అనే అంశం గురించి జరిగిన సెమినార్‌లో ఆయన ప్రసంగించారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు మాట్లాడుతూ వైద్యులు ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలను అధ్యయనం చేయాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున మాట్లాడుతూ.. వైద్య చికిత్సలో అనేక నూతన పరికరాలు వచ్చాయని, వాటి ద్వారా చికిత్స సులభతరం అయ్యిందన్నారు. కార్యక్రమంలో కాటూరి మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ నాగేశ్వరమ్మ, సిద్ధార్థ మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయి తేజ, అడిషనల్ ప్రొఫెసర్ హరిత తదితరులు పాల్గొన్నారు.



గుండ్లాపల్లి వద్ద ప్రమాదానికి గురైన వెంకటేష్‌ను బయటకు తీస్తున్న స్థానికులు (ఫైల్)



వెల్లంపల్లి- తాళ్లూరు రోడ్డు వద్ద స్కూల్ బస్సు ఢీకొని మృతి చెందిన మహిళ (ఫైల్)



మృతి చెందిన సివిల్ కానిస్టేబుల్ కాశిం సుభాని (ఫైల్)



చీమకుర్తి నగర శివార్లలో ట్రాఫిక్ నిబంధనలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయిస్తున్న పోలీసులు (ఫైల్)

నిర్లక్ష్యం ఖరీదు.. నిండు ప్రాణాలు!

- నిర్లక్ష్యం, అతివేగంతోనే ప్రమాదాలు
- ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులు
- 10 మందికి పైనే గాయాలు
- గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు

చీమకుర్తి రూరల్:

ఒక చిన్న నిర్లక్ష్యం కారణంగా ఖరీదైన ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో బాధితుల కుటుంబం మొత్తం అనాథగా మారుతోంది. వాహనాలు నడిపేటప్పుడు మనతో పాటు మన కుటుంబాన్ని గుర్తుంచుకుంటే చాలు.. మన గమ్యాన్ని చేరుకోవచ్చు. హెల్మెట్, సీట్ బెల్ట్ పెట్టుకుంటే దాదాపుగా మన ప్రాణాలను మనం దక్కించుకోవచ్చు.

అతివేగం.. నిండుగా నిర్లక్ష్యం..

నిర్లక్ష్యం, మద్యం తాగి నడపటం, అతివేగం కారణంగా ప్రతి నిత్యం ఎక్కడో ఒక చోట ప్రమాదం సంభవిస్తూ నిండు ప్రాణాలు కోల్పోతున్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవడం, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం.. ముఖ్యంగా యువత హై స్పీడుతో బైకులు నడుపుతుండటంతో వారితో పాటు ఇతరులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. దీంతో రోడ్డు ప్రమాదాల్లో పిల్లలను కోల్పోయి తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలిస్తున్నారు. అలాగే కుటుంబ పెద్దలను కోల్పోయిన పిల్లలు అనాథల్లా మారిపోతున్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని వాహనాలు నడపాలి. ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తే ప్రమాదాల తీవ్రత తగ్గుతుందని పోలీసులు చెప్తున్నారు.

పోలీసులు అవగాహన కల్పిస్తున్నా..

రోడ్డు భద్రతా వారోత్సవాల్లో రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు రోడ్డు రవాణా శాఖా అధికారులు అవగాహన కలిగిస్తున్నప్పటికీ కొందరిలో మార్పు కనిపించడంలేదు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. అధికారులు మాత్రం ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటిస్తేనే ప్రమాదాలను నిరోధించే అవకాశం ఎక్కువగా ఉంటుందని చెప్తున్నారు. దీనికి తోడు ఆటోవాలాలు పరిమితికి మించి ఎక్కించుకోవడంతో ప్రమాదాలకు కారకులవుతున్నారు. కొండపిలో ఇటీవల పచ్చాకును తరలించే ట్రాక్టర్లు బోల్తా పడి కూలీలు దుర్మరణం చెందారు.



చీమకుర్తి తూర్పు బైపాస్ రోడ్డు కూడలిలో హెల్మెట్ పెట్టుకోవాలని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కొన్ని ఘటనలు ఇలా..

- గతేడాది అక్టోబర్ 19 రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందాడు. దోర్నాలకు చెందిన కే కాశీం సుభాని ఒంగోలు పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. దోర్నాల నుంచి ఒంగోలుకు వస్తుండగా చీమకుర్తి సమీపంలో రెడ్డినగర్ వద్ద బైక్ అదుపు తప్పడంతో కిందపడి తీవ్రగాయాలవడంతో కాశీం సుభానీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.
- ఈనెలలో మద్దిపాడు మండలం కొలచనకోటకు చెందిన ఓ మహిళ ప్రైవేటు స్కూల్ బస్ ఢీకొని మృతి చెందింది. గ్రామానికి చెందిన మోరబోయిన సుబ్బారావు తన భార్య రాములుతో కలిసి పొలంలో గడ్డి కోసుకొని బైక్‌పై గ్రామానికి వెళ్తున్నారు. వెల్లంపల్లి–తాళ్లూరు రహదారిలో వెనుక వైపు నుంచి మద్దిపాడు మండలంలోని ఒక ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు వేగంగా వచ్చి ఢీకొనడంతో భార్యభర్తలు కింద పడిపోయారు. ఈ క్రమంలో వారిని 108 ద్వారా ఒంగోలు జీజీహెచ్ తరలిస్తుండగా మార్గమధ్యంలో రాములు (46) మృతి చెందింది.
- జే. పంగులూరు మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన సింగారపు వెంకటేష్ అనే వ్యక్తి బైక్ పై ఒంగోలు నుంచి గ్రామానికి వెళ్తున్నాడు. గుండ్లపల్లి ఫ్లై ఓవర్ పై గ్రానైట్ లోడుతో వెళుతున్న లారీని వెనకనుంచి ఢీకొట్టడంతో మోటార్ సైకిల్ ముందు చక్రం లారీ వెనకటైర్ల మధ్య ఇరుక్కుపోయింది. ఈ క్రమంలో వెంకటేష్ ఎడమ కాలు లారీకి మోటార్ బైకుకు మధ్య ఇరుక్కుపోయి వ్యక్తికి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అదే హెల్మెట్ ఉంటే ప్రాణాలు దక్కేవి.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి..



ప్రతి వాహనదారుడు వాహనం నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువ రోడ్డు ప్రమాదాలు అతివేగం, ఓవర్ టేక్ మద్యం తాగి డ్రైవింగ్ చేసేటప్పుడే ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కొందరు ఇతరుల ప్రాణాల మీదకు తెస్తున్నారు. కావున ప్రతి వ్యక్తి, డ్రైవర్‌లు నింధనలపై అవగాహన కలిగిఉండాలి. నగర శివార్లలో వాహనదారులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్నాం.

– ఎం సుబ్బారావు, సీఐ, చీమకుర్తి

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష..



ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా తలకు హెల్మెట్ ధరించాలి. చిన్నపాటి నిర్లక్ష్యానికి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. ముఖ్యంగా మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు. ఇస్తే యజమానులు బాధ్యులు అవుతారు.

– కృష్ణయ్య, ఎస్సై, చీమకుర్తి

చెత్త సంపద తయారీ కేంద్రంతో అదనపు ఆదాయం



పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న డీపీవో వెంకట నాయుడు

సంతనూతలపాడు: చెత్త సంపద తయారీ కేంద్రంతో అదనపు ఆదాయం సాధించాలని జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకట నాయుడు పేర్కొన్నారు. ఆదివారం మండలం కేంద్రం సంతనూతలపాడులో ఆయన పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని పంచాయతీ సిబ్బంది ఇంటింటా తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. సేకరించిన చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రానికి తరలించాలన్నారు. అక్కడ వాటితో వర్మీ కం పోస్టును తయారీ చేసి పంచాయతీకి అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్నారు. మండలంలోని వేములపాడు, గుడిపాడు, మద్దులూరు, గుమ్మలంపాడు, చిలకపాడు తదితర గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రమణమ్మ, ఇన్‌చార్జ్ కార్యదర్శి ఎస్ ప్రతాప్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ శిఖామణి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సబ్ జూనియర్ ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక రేపు

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా సబ్ జూనియర్ ఫెన్సింగ్ క్రీడాకారుల (బాలురు, బాలికలు) ఎంపిక ఈనెల 25న స్థానిక మినీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఏపీ ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, ప్రకాశం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.నవీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఆధార్ కార్డు, వయస్సు ధ్రువీకరణ పత్రంతో 14 సంవత్సరాల్లోపు వారు, ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఏఐ) వారు జారీ చేసిన గుర్తింపు కార్డును కలిగిన వారు మాత్రమే ఎంపికకు హాజరు కావాలన్నారు. ఎంపికైన వారు మార్చి 1, 2 తేదీల్లో ఎన్‌టీఆర్ జిల్లా పొన్నవరంలో జరిగే 11వ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు కోచ్ రాజు సెల్ నంబర్ 7671991147 ను సంప్రదించాలన్నారు.

శాస్త్రోక్తంగా కళారాల నగరోత్సవం



కనకదుర్గ పరమేశ్వరీ కళారం నగరోత్సవం

ఒంగోలు మెట్రో: కనకదుర్గ పరమేశ్వరి నూతన కళారాల ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఒంగోలు బాలాజీరావు పేటలో కనకదుర్గమ్మ, పోలేరమ్మ, దుర్గా మల్లేశ్వరి వార్షికోత్సవాల సందర్భంగా దుర్గా మల్లేశ్వరి శాంతి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు వేమా వెంకటస్వామి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు గోపీనాథ్ శర్మ, అర్చకుడు శ్రీనివాసరావు, ప్రసాద్‌లు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా మంగళ వాయిద్యాలు, మండప దేవత పూజలు, అనుష్టానములు, విశేష దేవత హోమాలు, జలాధివాసం, ధాన్యాధివాసం, పుష్పాదివాసం, సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఒంగోలు టౌన్: నగరంలోని గాంధీరోడ్డులో గల వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వాసవీ క్లబ్, వాసవీ క్లబ్ సిటీజన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో వెరికోస్ వెయిన్స్ రోగులకు ఏవీస్ వైద్యశాలకు చెందిన వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికీ మందులు, లేజర్ చికిత్సలు సూచించారు. ఈ శిబిరంలో 83 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు క్లబ్ వైస్ ప్రెసిడెంట్ గార్లపాటి బ్రహ్మానందం తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు బీ లావణ్య, క్లబ్ ప్రతినిధులు భూమా శ్రీనివాస్, మద్దాలి శివప్రసాద్, తవ్వా కిరణ్, సంపత్, అరవింద లక్ష్మి, రాజా, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ నిర్వహణ



ప్రశ్నాపత్రం విడుదల చేస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాసులు

ఒంగోలు సిటీ: రాష్ట్రస్థాయి కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ విజయవంతంగా నిర్వహించామి ఆంధ్ర హైస్కూల్ కరస్పాండెంట్ బొమ్మల శ్రీనివాసరావు తెలిపారు. ఒంగోలు సత్యనారాయణపురంలోని ఆంధ్ర హైస్కూల్‌లో 11వ రాష్ట్రస్థాయి కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఆదివారం నిర్వహించారు. ఈ–అభ్యాస్ అకాడమీ వారి ఆధ్వర్యంలో 11వ కే శాట్ ఒలంపియాడ్ మొదటి స్థాయి పరీక్షను 57 వేల మంది విద్యార్థులు తమ పాఠశాలలో రాసినట్లు తెలిపారు. ఈ పరీక్షకు17,500 మంది విద్యార్థులు రాశారని, 10 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఆంధ్రహైస్కూల్ లో జరిగిన పరీక్షలో 25 పాఠశాలల నుంచి 1250 మంది పాల్గొన్నారని తెలిపారు. ఈ–అభ్యాస్ సీఈఓ భువనగిరి ఫణిపవన్, రిజనల్ మేనేజరు కిరణ్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో 1,2,3 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఏప్రిల్ 13న గుంటూరులో జరిగే 11వ అభ్యాసోత్సవ్ అవార్డు ఫంక్షన్‌లో మెమొంటోలు, నగదు బహుమతులు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వంశీ, నారాయణ, జగదీష్, శివప్రసాద్, యోగేష్, కరస్పాండెంట్లు, ఇన్‌చార్జిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేడుకగా అభయాంజనేయస్వామి ప్రతిష్ఠ



అలంకరణలో అభయాంజనేయస్వామి



అభయాంజనేయ స్వామి దర్శనంలో భక్తులు

ఒంగోలు మెట్రో: శ్రీఆంజనేయం.. ప్రసన్నాంజనేయం నామస్మరణతో నగరం పులకించిపోయింది. ఒంగోలు నగరంలోని మామిడిపాలెంలో సీతారామ స్వామి వారి దేవస్థానంలో అభయాంజనేయస్వామి శిలా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఆదివారం నేత్ర పర్వంగా జరిపించారు. వేద పురోహితులు సన్నిధిలో రత్నన్యాసం, యంత్ర స్థాపన జరిపించిన తర్వాత స్వామి వారి ఏడు అడుగుల విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రాణ ప్రతిష్ఠ, కుంభం పోయుట, పూర్ణాహుతి శాస్త్రోక్తంగా జరిపించారు. ప్రధాన దేవతలకు మంగళ హారతులు సమర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. స్వామి సన్నిధిలో భక్తులు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షులు ఉల్లగంటి హనుమంతరావు, గౌరవ అధ్యక్షులు జ్వాలా నరసింహారావు, ప్రధాన కార్యదర్శి శ్రీ కొల్లి వెంకారెడ్డి, ట్రెజరర్ అంబటి ఆదినారాయణ రెడ్డి ,ఉపాధ్యక్షులు సుబ్బారావు కమిటీ సభ్యులు పాల్గొన్నారు